ప్రజాశక్తి

11-11-42 బుధవారం

సోవియట్ యుద్ధ ఆశయాలు

రష్యా విప్లవం యొక్క 25 వ వార్షికోత్సవ సందర్భంలో కామ్రేడ్ స్టాలిన్ మాస్కో సోవియట్ సమావేశంలో గావించిన ఉపన్యాసం చదివితే, సోవియట్ యూనియన్ యే విధంగా ప్రపంచప్రజ లందరికీ నాయకత్వం వహించి జర్మన్ ఫాసిస్టులతో యుద్ధంచేస్తున్నదో స్పష్టమవుతూంది.

యూరపులో రెండవ యుద్ధరంగం తెరువబడనప్పటికీ సోవియట్ రష్యా యీ $1\frac{1}{2}$ సంవత్సరాలలోను ప్రదర్శించుతున్న ధైర్య సాహసాలు, పట్టుదల ప్రపంచాన్నంతటినీ దిగ్భ్రమలో ముంచుతున్నాయి. "ఫాసిస్టు జర్మన్ హంతకులు, వారి మిత్రులు గావించిన యింత తీవ్ర దండయాత్రను యింతవరకే దేశంగాని, యే సైన్యంగాని యెదుర్కొని నిలబడలేద"ని కామ్రేడ్ స్టాలిన్ అన్నప్పుడు అందులో అతిశయోక్తి యేమాత్రం లేదు. అజేయమైనదని విన్రీపీగే హిట్లర్ సైన్యం సోవియట్ భూమిపై అపార నష్టాలకు గురి అవుతోంది. సోవియట్ యూనియనును నాశనం చేసి ప్రపంచాధిపత్యం సంపాదించాలని హిట్లరు, వాని మిత్రులు వాంఛిస్తున్నారు. ప్రపంచ ప్రజలీ ప్రమాదాన్ని గుర్తించారు. తమ భవిష్యత్తును నిర్ణయించేది సోవియటు వీరులే నను సంగతి తెలుసుకొని, వారు రష్యాకు చేయగల సహాయాన్నంతటినీ చేస్తున్నారు. సోవియట్ ప్రభుత్వానికి కూడా యీ యథార్థం తెలుసు. కనుకనే ప్రతి యుద్ధ రంగంలోను సోవియట్ సైన్యం నాజీ విశాచాల తెంత యెక్కువ నష్టం కలిగించాలో అంత నష్టం కలిగిస్తూంది. ఇందువల్లనే ప్రపంచ ప్రజలు సోవియట్ వీరులకు జోహారు లిస్తున్నారు.

యూరప్‌లో రెండవ యుద్ధరంగాన్నిగురించి కామ్రేడ్ స్టాలిన్ పలికిన పలుకులు మిత్రరాజ్యాల కొక వార్నింగ్, ప్రపంచ ప్రజలకొక హెచ్చరిక, అని చెప్పవచ్చు ఈ సంవత్సరం జూన్ మాసంలో బ్రిటన్- రష్యాల మధ్య జరిగిన ఆంగ్లో-సోవియట్ సంధి ప్రకారం, 1942 లో యూరప్‌లో రెండవ యుద్ధరంగం తెరువాలని నిశ్చయించబడింది. ఇది జరిగితే హిట్లర్ ఈ పాటికి పతనమయేవాడు. 1942 లో హిట్లర్ పరాజయం తప్పనని సోవియట్ నాయకులు పదేపదే గావించిన ప్రకటనల అర్థం యిదే. కాని, నేటి వరకు రెండవరంగం తెరువబడలేదు. 1942 వ సంవత్సరం ఆఖరు కావస్తుంది. సంచిషరతులను అమలుపరచడానికి సోవియట్ ప్రభుత్వం చేస్తూన్న కృషి, వారి నాయకుల రాజనీతిజ్ఞతను పెల్లడించుతుంది. రెండవ రంగం విషయమై జాగుచేస్తూన్న బ్రిటన్- అమెరికాలతో సంబంధం తెంచుకోవడమంటే అర్థం, హిట్లర్ కోరే పనిని చేసిపెట్టడమన్నమాట. ఏమీచేయక ఊరుకోవడమంటే అర్థం, సామ్రాజ్యవాదులకు లొంగిపోయి ప్రపంచ ప్రజలకు ద్రోహం చెయ్యడమన్నమాట. కనుకనే, కామ్రేడ్ స్టాలిన్ యిలా చెప్పాడు: "ప్రాన్సు పతనమయిన తర్వాత, ఫాసిస్టు జర్మనీని పడగొట్టడానికి రెండవరంగం తెరువబడక పోవడంవల్ల స్వాతంత్ర్యాన్ని కాంక్షించే దేశాలన్నింటికి, ముఖ్యంగా మిత్రరాజ్యాలకు సహితం, ముప్పు వాటిల్లడం తప్పదనే సంగతిని వారు గ్రహించవలసియుంది." ఈ హెచ్చరిక మిత్రరాజ్యాల ప్రభుత్వాలకు మాత్రమేగాక, అచ్చటి ప్రజలకుకూడా ఉద్దేశించబడింది. సామ్రాజ్యవాదుల్ని జయప్రదంగా లొంగదీయగలిగినది ప్రజలశక్తి అని కామ్రేడ్ స్టాలిన్‌కు తెలుసు. వారిలో కామ్రేడ్ స్టాలిన్‌కి సంపూర్ణమైన విశ్వాసంవుంది. కనుకనే అతడు, "త్వరలోనే రెండవరంగం తెరువబడుతుంది" అని చెప్పాడు.

బానిస జాతుల భవిష్యత్తునుగురించి మిత్రరాజ్యాల ఆశయాలేవో కామ్రేడ్ స్టాలిన్ ఈ క్రింది కార్యక్రమాన్ని తెలియజేశారు: "వేర్వేరు జాతుల మధ్య సమానహోదా; వాటి సరిహద్దుల రక్షణ; బానిస జాతుల విమోచన; వారికి స్వతంత్ర రాజ్యాంగ నిర్మాణపు హక్కు; తమకిష్టమైన పరిపాలనా విధానాన్ని యేర్పాటు చేసుకొనేహక్కు...." ఈ కార్యక్రమం ప్రపంచ పీడిత ప్రజలందరికీ వర్తిస్తుంది. ఆంధ్ర పత్రికలో ఈ భాగాన్ని తప్పుగా తర్జుమాచేశారు: "జర్మనీ, ఇటలీలకు బానిసరాజ్యములైన దేశములకు తిరిగి స్వాతంత్ర్యం ఇప్పించుట," అనిఉంది. కాని, ఉపన్యాసం యొక్క-మూలంలో 'Liberation of enslaved nations and the restoration of their sovereign rights' అని వుంది. ఆక్రమిత యూరప్‌లో ఫాసిస్టు నియంతల సంకెళ్లలో బంధింపబడిన దేశాల భవిష్యత్తును గురించి కామ్రేడ్ స్టాలిన్ ఈ ఉపన్యాసంలోనే మరొకచోట ఉదాహరించాడు. కాన, పైన పేర్కొనబడిన కార్యక్రమం ప్రపంచ బానిసజాతు లందరికీ వర్తిస్తుంది.

బానిసజాతుల విమోచనను గురించి, వారి కీయవలసిన స్వతంత్ర రాజ్యాంగ నిర్మాణపు హక్కును గురించి, కామ్రేడ్ స్టాలిన్ అన్న మాటలు సామ్రాజ్యవాదుల గుండెలలో అప్పుడే పని చేస్తున్నాయి. "మెడ్రాస్ మెయిల్" పత్రిక వ్రాసిన వ్యాఖ్య యిందు కుదాహరణ. "బాల్టిక్ రాజ్యాలు సోవియట్ యూనియన్‌లో చేర్పబడాలని రష్యా యుద్ధానికి పూర్వం పట్టుపట్టింది. యుద్ధం పూర్తియాయాక వాటి స్వతంత్ర రాజ్యాంగ నిర్మాణపు హక్కు తిరిగి యీయబడుతుందా? తమకే పరిపాలన విధానం కావాలికోరితే ఆ పరిపాలనా విధానానికి రష్యా అంగీకరిస్తుందా?" అని మెయిల్ పత్రిక వ్రాసింది. లాట్వియా, లిథువేనియా, ఇస్టోనియా అనే మూడు బాల్టిక్ రాజ్యాలు సోవియట్ యూనియన్‌లో చేరేముందు ఆ దేశాల ప్రజలు తమ తమ ప్రజా ప్రతినిధి సభలలో అంగీకారాన్ని ప్రకటించియున్నారు. ఈ విషయాన్ని మనం పత్రికలలో చదివే యున్నాం. "మెడ్రాస్ మెయిల్" పత్రిక చేసే యీ అబద్ధపు ప్రచారం దాని సామ్రాజ్య తత్వాన్ని మాత్రమే తెలుపుతుంది.

బల్గేరియా రుమేనియా దేశాలు యిపుడు నాజీల కనుకూలంగా వున్నాయిగాన వాటికి స్వయం నిర్ణయాధికారం యివ్వరాదని కూడ మెయిల్ పత్రిక వ్రాసింది. నాజీ పరిపాలన స్థానే తమ పైత్రనంక్రింద వుండే ప్రభుత్వాలు స్థాపించబడాలని యీ బ్రిటిషు సామ్రాజ్యవాద పత్రిక అభిప్రాయం. స్టాలిన్ చెప్పిన యీ క్రింది వాక్యాలు యీ పత్రికకు సరియైన సమాధానం; "జర్మనీ దేశాన్ని నాశనం చేయడం మన ఉద్దేశ్యంకాదు..... జర్మనీని పరిపాలించే హిట్లరు కూటాన్ని నాశనం చేయడమే మన కర్తవ్యం." ఇలాగే బల్గేరియా, రుమేనియాలలో కూడ ఫాసిస్టు పాలకవర్గం నాశనం చేయబడాలి. కాని ప్రజలకు స్వయం నిర్ణయ హక్కునుయిచ్చితీరాలి. ప్రజలు తప్పక ప్రజాస్వామ్య పద్ధతినే - అది యే స్వరూపంలో వున్నప్పటికీ - తప్పక కోరుకుంటారు.

కామ్రేడ్ స్టాలిన్ బానిసదేశా లన్నిటి స్వాతంత్ర్యం కొరకు కృషిచేస్తున్నారు. బానిస దేశాలలో భారత దేశంకూడ ఒకటి. దీని అర్థం స్టాలిన్ మన దేశానికి స్వాతంత్ర్యం తెచ్చి వ్రసాదిస్తాడని కాదు. ప్రపంచ ప్రజ లందరితోను భారతీయులుకూడా చేయిచేయి కలిపి సోవియట్ యూనియన్ నాయకత్వాన పోరాడి, ప్రజాయుద్ధంలో విజయాన్ని సాధించాలి. అందుకై యుద్ధ నిర్వహణాన్ని ప్రజాయత్తం చేసికోవాలి; జాతీయ ప్రభుత్వాన్ని నిర్మించుకోవాలి. సంపూర్ణ జాతీయైక్యత ఒక్కటే యిందుకు మార్గం.

బోల్షివిక్ పోటీ.

కామ్రేడ్స్!

నవంబరు విప్లవ దినోత్సవ ధన్యవాదాలు. నవంబరు డే కి యివ్వబడిన కోటాలను మించి ప్రజాశక్తి ప్రచారం వృద్ధి అయింది. ఐదువేల కోటా అయితే, ఆరువేల పూర్తిచేయ గలిగారు. అందులకు కామ్రేడ్సుకు మా విప్లవాభి వందనాలు. తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, క్రిష్ణా, గుంటూరు, నెల్లూరు జిల్లాల కామ్రేడ్స్ ముఖ్యంగా అత్యుత్సాహంతో పని జేశారు. కొన్ని జిల్లాలు లెనిన్ దినోత్సవంనాటి కోటాలను కూడా దాటుపుయిపుడే పూర్తి జేశాయి. ఆ జిల్లాల కామ్రేడ్స్ యిదే విధంగా ద్విగుణీకృత ఉత్సాహంతో పనిజేయాలి. తమ జిల్లాలకు యెర్రి దెండా బహుమతి పొందడానికి కృషిచేయాలి, వెనుకబడిన జిల్లాల కామ్రేడ్స్ లెనిన్ డే నాటికైనా తమ కోటాలను పూర్తి చేయాలని కృత నిశ్చయంతో పనిచేయాలి.

జిల్లాల పేర్లు	నవంబరుదే కోటా	నవంబరు 8 తేదీకి చేరించినవి			లెనిన్ దినోత్సవంనాటికి
		విడికాపీలు	చందాదార్లు	మొత్తం	
విశాఖపట్టణం.	200	117	14	131	300
తూర్పు గోదావరి.	300	465	39	504	500
పశ్చిమ గోదావరి.	500	295	254	549	1000
కృష్ణా.	1750	1021	998	2019	2500
గుంటూరు.	850	755	384	1139	1250
నెల్లూరు.	500	438	280	718	1000
కర్నూలు.	150	93	30	123	250
కడప.	100	40	15	55	200
అనంతపూర్.	100	40	20	60	200
చిత్తూరు.	100	60	30	90	300
ఇతర రాష్ట్రాలు.		531	81	612	
		3855	2145	6000	7500

బోల్షివిక్ అభినందనాలతో

రాష్ట్ర కమిటీ.

కులంగాడి అంత్యక్రియలు

[అ భూ త క ల్ప న]

పాపం! కులంగాడు చచ్చిపోయాడు. అమిత వృద్ధుడు. ఎంతో కాలం డాబుమీద కొట్టుకొచ్చాడు. తనకు జరామృతి లేదని ఎంతోమందిని జయప్రదంగా నమ్మించి తన గొయ్యి తనే తవ్వుకున్నాడు. - ఇవాళ వాడి శవం చివికి దుర్గంధం కొడుతున్నా, వాడికి అంత్యక్రియలు చేసేవాళ్ళు లేరు! వాడింకా యే మూలో ఉక్కుతునకల్లే తిరుగుతున్నట్టే నబిస్తున్నారు. కులంగాడు బతికుండగా చేసిన పాపం యీవధంగా వాడి శవం మీద పగ తీర్చుకుంటున్నదేమో!

నిజానికి కులంగాడిది వింత జీవితం, వాడు మొదటినించీ పరమ పాపి! అయితే యేం? ప్రపంచం వాడి కొకప్పుడెంతగా బ్రహ్మరథం పట్టింది! యేం వెలుగు వెలిగాడు - ఛందాలుడు! వాడిది సుగ్రీవాజ్ఞ! వాడి అధికారానికి తిరుగులేదు! వాడు చెప్పిందే వేదం! బ్రాహ్మణులు వాణ్ణి ప్రతిష్టించారు. వాడికి జరిగిన గౌరవ మర్యాదలు, వాడికి చూపించిన వినయవిధేయతలు, భయభక్తులు మానవ జాతి మరెవరికీ చూపించలేదు.

వాణ్ణి ప్రతిష్టించిన బ్రాహ్మల ప్రభ అయిపోయి నాకకూడా వాడి శకం అయిపోలేదు. మనుష్యులను శాసించటానికి అధికారంగా దొకడు వచ్చాడు - నిజమే. అధికారంగాడు తన ప్రభ కులంగాడి ప్రభకన్న ఎక్కువైనదని యెరుగును - అదీ నిజమే. కాని యెందుకట్లు అధికారంగాడు కులంగాడితో ఆటే తగూ పెట్టుకోలేదు. కులంగాడి పలుకుబడి చూసి అధికారంగాడు కూడా జంకాడనే చెప్పాలి. కులంగాడు అధికారంగాడి పీడికి పోక తన పరువు నిలబెట్టుకున్నాడు. ఈ యిద్దరూ యెదురై నప్పుడల్లా ఒకరికొకరు దూరంనించే అతిగౌరవంగానలాము చేసుకొని యెవరి దారిన వారు వెళ్ళటంచూసి కులంగాడి ప్రభ యింకా ఉచ్ఛస్థితిలోనే వుందని భ్రమపడ్డారు. కులంగాడు దర్బారికి పోయి అధికారంగాడితో జట్టీ పెట్టుకునివుంటే కులంగాడి బండారం యెప్పుడో బయటపడి వుండును. కులంగాడికింకా చాలా మంచి రోజులు, మొత్తంమీద వాడు అద్భుత జాతకుడు!

కులంగాడింకా రొమ్ము విరచుకుని మీసాలకురంగు వేసుకుని తిరుగుతుండగానే అధికారంగాడి పటుత్వం ఉడిగిపోయింది. మనుష్యులను పాలించటానికి ధనంగా దొచ్చాడు.

ధనంగాడు పరమ కర్కోటకుడు. మానవ సహజమైన దౌర్బల్యాలేవీ వాడిలో లేవని మనోవైజ్ఞానికులు తేల్చారు. దయా, ఓర్పూ, ఆపేక్ష, భయమూ, విశ్వాసమూ, పశ్చాత్తాపమూ, గౌరవమూ- ఇటువంటి గుణాలకు వాడతీతుడు. కులంగాడు డాబుచేసీ, అధికారంగాడు అడలగొట్టీ, జనాన్ని పాలిస్తే, ధనంగాడు తన అలిఖిత శాసనాన్ని విశ్వజనం నిష్కర్షగా పాలించాడు. ధనంగాడి శాసనం వాతపడే వరకూ ఎవరికీ అటువంటి శాసనం ఉందనే తెలియదు. ధనంగాడికి పక్షిసిటీ అవసరంలేదు. వాడు అన్నివీథులూ తిరిగేవాడుకాడు. ముఖ్యమైన రాజవీథులలోనే తన ప్రభ వెలిగించాడు. వాడి నమగ్రస్వరూపాన్ని తనివీదీర చూసే అదృష్టం బహుకొద్దిమందికే దక్కింది.

వాడి నడవడిక ఒక కళచేశాడు. వాడి నాజూకూ, మరవరాని వాడి మందహాసమూ, వాడి నాగరికతా, గ్రామ్యమైన వాడి కంఠధ్వని, అతి మెత్తని వాడి సంభాషణా జనాన్ని ముగ్ధుల్నిచేసేది. వాడి కర్కశ తత్వాన్ని ఎవరూ పాటించేవాడుకాడు. వాడి దయ కోల్పోయి రాజవీథినుండి సందులలోకీ గొందులలోకీ తరుమబడినవాళ్ళు సైకి వాణ్ణి నానామాటలూ అన్నా లోలోపల వాడి పాలనకోసం తపించేవాళ్ళు ఎట్లాగైనా వాడి అనుగ్రహం సంపాదించి రాజవీథికెక్కటానికి, రాజవీథికి పొయ్యే సందులలో జనం కిటకిటలాడుతూ ఒకరినొకరు తోసుకునేవాళ్ళు, వాడి దర్శనం అయితే చాలునని ఒకర్ని వెనక్కు మరొకరు ముందుకు వచ్చేవాళ్ళు. ధనంగాడి కొరదాదెబ్బలనుకూడా ముందున్నవాళ్ళు లక్ష్యం చేసేవాళ్ళుకారు.

కులంగాడిమీద విశ్వాసంకొద్దీ కొట్లాడి జనం తరతరాల అతి నీచమైన జీవితం జీవించారు. అధికారంగాడి కెదురాడలేక అనేకమంది అక్రమ శిక్షకు లోనై అవసరమైనప్పుడు ప్రాణత్యాగంకూడా చేశారు. కాని ధనంగాడి మహాత్మ్యం ఏమిటో వాడికోసం ప్రతి తీరలోనూ అనేక కోట్లమంది మనస్ఫూర్తిగా బలి అయినారు. కేవలమూ వాడి అనుగ్రహం పొందలేకా, కోల్పోయీ ఆత్మ హత్యలు చేసుకున్నవాళ్ళ సంఖ్యే ఎంతో పెద్దది.

అయితే ధనంగాడు జాస్తిగా రాజవీథులలోనే తన పరిపాలన సాగించటం కులంగాడికి చాలా కలిసి వచ్చింది. అధిక సంఖ్యకులైన జనం గల్లీలలోనూ, సందు గొందులలోనూ ఉండి ధనంగాడి మోహమైనా చూసిన పాపానయినా పోయినవారుకారు. (ధనంగాడి పరిపాలనలో ఈ సందులు జాస్తిగా విస్తరించి, పూర్వం ఎన్నడూ లేనంత అనారోగ్యకరంగా పరిణమించినట్టు రుజువయింది.) వృద్ధాప్యంలో కులంగాడు తన దర్జాయావత్తూ ఈ సందు గొందులలో వెలగబెట్టాడు. ఇక్కడఉండే దొంగా, గ్యులు, ఇంకా ప్రపంచాన్ని పాలిస్తున్నవాడుకులంగాడేననినమ్మాడు ధనంగాడువట్టి పాపి అనీ, వాడి పరిపాలనలో ఇహం ఉందేమోగాని పరం బొత్తిగా లేదనీ, ఇహంకంటె పరమే చాలా ముఖ్యమనే విషయం నిస్సందేహమనీ కులంగాడు ప్రచారంచేసి జనాన్ని నమ్మించాడు. వీడి ప్రచారాన్ని నమ్మనివాళ్లున్నారు. ఈ సందులు గొందులు ఇంత అనారోగ్యకరంగా దుర్గంధపూరితంగా ఉంచి సందుకు వారు కులంగాణ్ణి తప్పుపట్టారు. అందులో కొందరు ప్రాపంచిక సుఖం యావత్తూ రాజవీథుల లోనే ఉందనికూడా గుర్తించారు. రాజవీథులలోకి పోవటానికి జీవితమంతా ధారపోసి విఫలులైనవాళ్ళు, ధనంగాడి తథాఖా విని రాజవీథినించి పారిపోయి సందులలో నివసించటానికి వచ్చినవాళ్ళు కులంగాణ్ణి తెగపొగడి వాడి ప్రచారంలో తమ వృద్ధాప్యంగడిపి ధన్యులైనారు.

కులంగాడు మంచాన పడింది ఈ అనారోగ్యకరమైన సందులలో తిరగటంవల్లనే నని కొందరు శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు. ఏమయితేనేం వాడికి వ్యాధి అంటుతుందని ఎవరూ విశ్వసించకపోవటంచేత వాడికి సరిఅయిన చికిత్స జరగలేదు. కాకపోయినా కాటికి కాళ్ళుచాచుకున్న వాడికి చికిత్స ఏమిటి? అయితే ధనంగాడి శకం కూడా అయిపోయినట్టు కనిపిస్తున్నది, ఎక్కడినించో ఒక బ్రహ్మాండమైన నీడ వచ్చి పడుతున్నది. దీని ప్రమాణం చూస్తే ఈ వచ్చే మనిషి మహాకాయుడి ప్రమాణం కలవాడల్లే కనిపిస్తుంది. ఈ నీడ చూస్తేనే ధనంగాడి గుండెల్లో రైళ్ళు పరిగెత్తుతున్నై. "ఆ వచ్చేభూతం మనల్నందర్నీ పదునుగా తొక్కేస్తుంది. దాని కాళ్ళకిందపడి మనం మన సంస్కారమూ, నాగరికతా, ప్రాణాలూ కోల్పోతాం!" అని ధనంగాడు కేకలు పెడుతున్నాడు.

ఎన్నడూ ధనంగాడి దయకు పాత్రులు కాని వాళ్ళు సయితం, లోపల యేమూలో నాడిమీద గౌరవం ఉండి యీ భూతాన్ని గురించి భయపడుతున్నారు. కాని కొంతమంది పర్వాకాదు యీ సందుల్లో జనాన్ని భయపడవద్దని హెచ్చరిస్తున్నారు.

"ఈ వచ్చే భూతం మన పీడంన్నీ విరుగుడు చేస్తుంది. రాజ వీథులూ, సందులూ యేకం చేస్తుంది. ఈ దిక్కుమాలిన సందులూ, దుర్గంధపూరితమైన యిళ్ళూ, నాసిక మృతయిని యేడుస్తాయెందుకు? సంతోషించక! ఈ ధనంగాడి పరిపాలన అంతంచేసి యీ భూతానికి స్వాగతం యివ్వండి!"

"కాని మన కులంగాడి పరిపాలన పోతే మన గతి యేమిటి?" అని గొందుల్లోవాళ్ళు గోలెత్తుతున్నారు.

ఈలోపుగా కులంగాడి శరీరం కుళ్ళి దుర్వాసన కొడుతున్నది.

కొడవటిగంటి కుటుంబరావు

ప్రజల శక్తి చాటుదాం!

(1) కదన భూమి కేగుదాం - కత్తిదూసి దూకుదాం,
ఫాసిజాన్ని చూపుమాసి - ప్రజల శక్తి చాటుదాం ॥కు॥

(2) తెగిన మొండె మరసిన - పడిన శిరసు గాంచిన,
అదురు బెదురు లేక ఇంత - ఎదురుతిరిగి గెల్చుదాం ॥కు॥

(3) రక్తవాహి నీదుదాం - శత్రువులను జీల్చుదాం,
మృత్యువునకు వెదువమంచు-పోరి ముక్తి గాంచుదాం ॥కు॥

(4) కత్తిమీద నొరగుటో - కదనమందు గెల్చుటో,
భారతియ శూరవటల - గాళలంచు జాటుదాం ॥కు॥

(5) హిందు ముస్లిం లైక్యమై - విజృంభించి పోరుదాం,
చీన, రష్య, దేశ ప్రజల - స్నేహ మార్గమించుదాం ॥కు॥

(6) జాపానవగ వెంకతా - దాని తాహ తెంకతా,
అంతాగలిసి తంతేమళ్ళీ - అంతు దొరకేనంటరా ॥కు॥

(7) జాపానువాణ్ణి జీల్చుదాం - ప్రమాదాన్ని దాటుదాం,
ప్రజలమంత గలసి దివ్య - సౌఖ్య మనుభవించుదాం ॥కు॥

(8) సమర భూమి దూకుదాం - శత్రు శిరము నరుకుదాం,
జయ పతాకనెత్తుదాం - నిజయ ఘోష జెట్టుదాం ॥కు॥

— కామ్రేడ్ ముక్కామల నాగభూషణం.

మేల్కొలుపు

(శిథిలాలయమ్ములో.... పలె)

సమరాంగణమ్ములో జయము తేలోయి!
ఫాసిస్టులకు మ్రింగ మెతుకు లేలోయి!
దేశదేశాల ప్రజలు
చేయిచేయా కలిసి
స్వాతంత్ర్య సిద్ధికై
పాగి వస్తున్నారు-

భావిభారత స్వేచ్ఛకై కదలిపోవోయి!
ఫాసిస్టులకు 'గోరి' మిగులు నోయి!
ఊరూర ప్రజలు
ఉవ్వెత్తుగాపొంగి,
పోరాట రణసీమ
కరికి వస్తున్నారు-

ముందు వెనుకలు జూడగే నడచిపోవోయి!
కోటాన కోట్ల ప్రజశక్తి గలదోయి
ఆయుదమ్ములు లేవ?
ఐకమత్యమె చాలు!
ఫాసిస్టుల కదిమె
బలమైన గుండుదెబ్బ!

సమరాంగణమ్ములో జయము తేలోయి!
ఫాసిస్టులకు మ్రింగ మెతుకు లేలోయి!

—కామ్రేడ్, నార్ల చిరంజీవి.